క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హుడాకాంప్లెక్స్: విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా సోమవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సరూర్‌నగర్ డివిజనల్ ఇంజినీర్ కే.రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. 11కేవీ పుష్పాగార్డెన్స్ ఫీడర్ పరిధిలో ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు. 11కేవీ డెంటల్ కళాశాల ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 12 నుంచి 1.30 గంట వరకు. 11కేవీ సరూర్‌నగర్, శారదానగర్ ఫీడర్ల పరిధిలోని కాలనీల్లో మధ్యాహ్నం 1.30 నుంచి సాయంత్రం 4 గంటల వరకు. 11కేవీ చిత్రా లేఅవుట్, సాయికాలనీ ఫీడర్ల పరిధిలోని ప్రాంతాల్లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తామని, వినియోగదారులు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

సామాజిక విలువలను పెంపొందించుకోవాలి

హుడాకాంప్లెక్స్: విద్యార్థి దశలోనే సామాజిక విలువలు పెంపొందించుకోవాలని మాజీ ఎమ్మెల్యే కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి అన్నారు. సరూర్‌నగర్‌లోని బీసీ వెల్ఫేర్ బాలికల హాస్టల్‌లో లీడ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన స్కిల్ డెవలప్‌మెంట్ కార్యక్రమానికి కేఎల్లార్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులు పరీక్షల్లో వెనుకబడినా నిరాశ చెందకుండా ప్రయత్నించి విజయం సాధించాలని సూచించారు. లీడ్ ఇండియా ప్రోగ్రాం ద్వారా విద్యార్థులకు నైపుణ్య శిక్షణ ఇస్తున్నామన్నారు. ఏదైనా సాధించాలంటే తపన, పట్టుదల, నమ్మకం ఉండాలని పేర్కొన్నారు.

ఘనంగా షోడశలక్ష్మి హోమం


హోమం నిర్వహిస్తున్న భక్తులు

కందుకూరు: మండలంలోని పులిమామిడి పరిధిలోని శ్రీనిఖిల్ చేతనా కేంద్రంలో బ్రహ్మశ్రీ గురూజీ అనిల్‌కుమార్‌జోషి ఆధ్వర్యంలో ఆదివారం షోడశలక్ష్మి హోమాన్ని ఘనంగా నిర్వహించారు. ఎనిమిది రోజుల పాటు లక్ష్మీదేవికి ప్రత్యేక పూజలు, జపాలు చేశారు. అనంతరం అమ్మవారికి అభిషేకం పూజలు చేసి హోమాన్ని నిర్వహించారు. పూర్ణాహుతి చేశారు. సాధకులకు గురూజీ దంపతులు తీర్థప్రసాదాలు, ఆశీర్వాదాలతో పాటు అన్నప్రసాదం అందించారు. కార్యక్రమంలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

క్రికెట్ పోటీలు ప్రారంభం


బాచుపల్లిలో క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న నాయకులు

కందుకూరు: మండల పరిధిలోని బాచుపల్లిలో బీపీఎల్ పేరుతో ఏర్పాటు చేసిన క్రికెట్ పోటీలను ఆదివారం ఎంపీటీసీ మాజీ సభ్యుడు గుండాల సురేష్, బీఆర్ఎస్ గ్రామ యూత్ అధ్యక్షుడు నరేశ్ ప్రారంభించారు. ప్రథమ, ద్వితీయ స్థానంలో నిలిచిన జట్లకు యూత్ నాయకుడు నరేశ్ టీషర్టులు, ట్రోఫీతో పాటు రూ.12 వేలు, రూ.8వేల నగదును అందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ యాలాల శ్రీనివాస్, నాయకులు సీహెచ్ కృష్ణ, దువ్వాసి నర్సింహ, ఎగిరిశెట్టి రాజు తదితరులు పాల్గొన్నారు.

'ఫ్లైఓవర్'కు నిధుల మంజూరు


మంత్రి శ్రీధర్‌బాబుకు కృతజ్ఞతలు తెలుపుతున్న కార్పొరేటర్ బాలమణి

మీర్‌పేట: మీర్‌పేట కార్పొరేషన్ పరిధి గాయత్రినగర్ జంక్షన్‌గా టీకేఆర్ కమాన్ నుంచి మందమల్లమ్మ ఎక్స్‌రోడ్డు వరకు ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి ప్రభుత్వం రూ.416 కోట్లు మంజూరు చేయడం అభినందనీయమని 19వ డివిజన్ కార్పొరేటర్ బైగళ్ల బాలమణి అన్నారు. ఈ మేరకు మంత్రి శ్రీధర్‌బాబును ఆదివారం కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఫ్లైఓవర్ నిర్మించడంతో స్థానికంగా ట్రాఫిక్ సమస్య, రద్దీ తగ్గడంతో పాటు ఎయిర్‌పోర్టుకు వెళ్లే వాహనదారులకు ఇబ్బందులు తొలగుతాయని ఈ సందర్భంగా ఆమె పేర్కొన్నారు.

సుందరీకరణ కలేనా?

- ఆదరణ కోల్పోయిన జల్‌పల్లి చెరువు
- మసకబారుతున్న అందాలు
- కంచె లేక ప్రమాదాలు నిత్యకృత్యం


జల్‌పల్లి పెద్ద చెరువు


చెరువు సుందరీకరణ పనుల కోసం మ్యాప్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సబితారెడ్డి(ఫైల్)

పహాడీషరీఫ్: జల్‌పల్లి పెద్ద చెరువు సుందరీకరణ పనులు అటకెక్కాయి. ఆహ్లాదకరమైన వాతావరణంతో ప్రకృతి రమణీయతను సంతరించుకున్న పరిసరాలను ఎప్పుడెప్పుడు అభివృద్ధి చేస్తారా అని ప్రజలకు ఎదురు చూస్తున్నారు. కొండలు, చెట్లు, పచ్చిక బయళ్ల నడుమ 150 ఎకరాల విస్తీర్ణంలో నిండు కుండలా ఉన్న చెరువు అందాలు చూడాలంటే రెండు కళ్లు చాలవు. అలాంటి చెరువును ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో చెరువు అందాలు మసకబారుతున్నాయని, అసలు అభివృద్ధికి నోచుకుంటుందా అని అనుమానం వ్యక్తంచేస్తున్నారు.

ఇనుప కంచెతో సరి

ఎనిమిదేళ్ల క్రితం నాటి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు చెరువును అభివృద్ధి చేస్తే.. చక్కటి పర్యాటక కేంద్రంగా మారే అవకాశం ఉందని ప్రాంత ప్రజలు పేర్కొంటున్నారు. రూ.9 కోట్ల వ్యయంతో చెరువు చుట్టూ వాకింగ్ ట్రాక్, మైసమ్మ ఆలయ సమీపంలో చెరువు మధ్యలో ఉన్న చిన్న గుట్ట వరకు స్టీల్ బ్రిడ్జిని నిర్మించి ఐలాండ్ ఏర్పాటు, రెండు వ్యూ పాయింట్లు, ప్రమాదాలు జరగకుండా పూర్తి స్థాయిలో ఇనుప కంచెతో పాటు చెరువు గట్టున ఉన్న గుట్టను రాక్ గార్డెన్, ప్రకృతి ప్రియుల కోసం బోట్ షికార్ సైతం ఏర్పాటు చేయాలని ప్రణాళికలు రూపొందించారు. కానీ ప్రస్తుతానికి కట్ట వైపు ఇనుప కంచె, కట్టపై విద్యుత్ సదుపాయం కల్పించి మమ అనిపించారు.

నిధులున్నా నిర్లక్ష్యం

మిషన్ కాకతీయ పథకంలో భాగంగా 2016లో నాటి ప్రభుత్వం రూ.45 లక్షల వ్యయంతో చెరువు కట్ట పునరుద్ధరణ, అలుగును పూర్తి స్థాయిలో మరమ్మతులు చేసింది. ఆ ఏడాది నుంచి భారీ వర్షాలు కురవడంతో చెరువు పూర్తిగా నిండి అలుగు పోసింది. చెరువులోకి నీరు సమృద్ధిగా చేరడంతో చేపల పెంపకందారులకు జీవనోపాధి లభించింది. 2024 సెప్టెంబర్ 27న ఎమ్మెల్యే పి.సబితారెడ్డి హెచ్ఎండీఏ అధికారులతో కలిసి చెరువును సందర్శించారు. సుందరీకరణ చేయాల్సిన పనుల గురించి చర్చించారు. ఇందుకు సంబంధించిన నిధులు సైతం ఉన్నప్పటికీ హెచ్ఎండీఏ అధికారులు నిర్లక్ష్యపు ధోరణిని వీడటం లేదు.

తరచూ ప్రమాదాలు

చెరువుకు కంచె పూర్తి స్థాయిలో వేయని కారణంగా యువకులు సరదాగా ఈత కొట్టేందుకు దిగి, నీట మునిగి మృత్యువాత పడుతున్నారు. ఇలాంటి ఘటనలు నిత్యం జరుగుతూనే ఉన్నాయి. కట్టపై పూర్తిగా కంచె వేసినప్పటికీ, మైసమ్మ ఆలయం వద్ద వినాయక ప్రతిమల నిమజ్జనం కోసం అధికారులు రెండు చోట్ల కంచెను తొలగించారు. ఈ కారణంగా ఓపెన్‌గా ఉండడంతో ఎంతో మంది ప్రమాదవశాత్తు అందులో పడి దుర్మరణం చెందుతున్నారు. జల్‌పల్లి కమాన్ రోడ్డు, వాదే ముస్తఫా వైపు కూడా పూర్తి స్థాయిలో కంచె వేసినట్లయితేనే ప్రమాదాలను నివారించే అవకాశం ఉంది.

మురికి కూపంగా..



నియోజకవర్గంలోని చెరువులను సుందరీకంచి, జల్‌పల్లి చెరువును పట్టించుకోవడం లేదు. ఈ చెరువు నిత్యం వాకర్లతో కళకళలాడుతుంటుంది. అలాంటి చెరువు.. అధికారుల ఉదాసీనత కారణంగా మురికి కూపంగా మారుతోంది. హెచ్ఎండీఏ అధికారులు స్పందించి, పర్యాటకులను ఆకట్టుకునేలా అభివృద్ధి చేయాలి. ప్రమాదాల నివారణకు తగిన చర్యలు చేపట్టాలి. – శివకుమార్, జల్‌పల్లి

ప్రాజెక్టుకు జైపాల్‌రెడ్డి పేరు హర్షణీయం


మాట్లాడుతున్న రమేశ్‌గౌడ్

బడంగ్‌పేట్: పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టుకు కల్వకుర్తి ముద్దుబిడ్డ స్వర్గీయ మాజీ మంత్రి సూదిని జైపాల్‌రెడ్డి పేరు పెట్టడం గర్వకారణమని కాంగ్రెస్ పార్టీ యువజన విభాగం రాష్ట్ర నాయకుడు జిల్ల రమేశ్‌గౌడ్ అన్నారు. ఈ సందర్భంగా ఆదివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టుకు మన ప్రాంతానికి చెందిన తెలంగాణ సాధకుడు ప్రజాస్వామ్యవాదిగా పిలువబడే కాంగ్రెస్ నాయకుడు జైపాల్‌రెడ్డి పేరు పెట్టడం సంతోషించదగ్గ విషయమన్నారు. నాలుగు జిల్లాలను సస్యశ్యామలం చేసి, తాగు, సాగునీరు అందించే ప్రాజెక్టుకు జైపాల్‌రెడ్డి పేరు పెట్టడానికి ప్రభుత్వ క్యాబినెట్ ఏకగ్రీవ తీర్మానం చేయడంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఎరుకల శ్రీనివాస్‌గౌడ్, గడ్డం లింగారెడ్డి తదితరులు ఉన్నారు.

బీసీలకు రిజర్వేషన్ కల్పించాలి


కమిటీ అధ్యక్షుడిగా మచ్చేందర్‌కు నియామకపత్రం అందజేస్తున్న కృష్ణ

బీసీ సేన జాతీయ అధ్యక్షుడు బర్క కృష్ణ

షాబాద్: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించాలని బీసీ సేన జాతీయ అధ్యక్షుడు బర్క కృష్ణ పేర్కొన్నారు. ఆదివారం మండల పరిధిలోని నాందార్‌ఖాన్‌పేట్ గ్రామంలో బీసీ సేన గ్రామ కమిటీ అధ్యక్షుడిగా మేకల మచ్చేందర్, ఉపాధ్యక్షులుగా రామకృష్ణ, నాగేశ్వర్ రావు, ప్రధాన కార్యదర్శిగా నర్సింలు, కార్యదర్శులుగా రాఘవేందర్, తాజ్, సలహాదారుగా సురేశ్, సభ్యులుగా వినోద్‌గౌడ్, రాజ్‌కుమార్, నందుచారి, శివలింగం, నరేందర్, శ్రీనివాస్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీసీలకు 42శాతం స్థానిక సంస్థల ఎన్నికల్లో కేటాయించిన తర్వాతే ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఎన్నికలలో ఇచ్చిన హామీని నెరవేర్చాలని ప్రభుత్వాన్ని కోరారు. బీసీ లెక్క తేలడానికి దేశ వ్యాప్తంగా కులగణన చేయాలని, పంచాయతీరాజ్ ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమలో బీసీ సంఘం నాయకులు తదితరులు ఉన్నారు.

ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత


అమ్మవారి వెండి ప్రతిమను బహూకరిస్తున్న విజయభాస్కర్‌రెడ్డి కుటుంబసభ్యులు

మాజీ సర్పంచ్ నర్సింహారెడ్డి

మొయినాబాద్, రూరల్: ఆధ్యాత్మిక చింతనతోనే ప్రతి ఒక్కరికి మానసిక ప్రశాంతత కలుగుతుందని అమ్డాపూర్ రక్తమైసమ్మ దేవాలయ చైర్మన్, మాజీ సర్పంచ్ గుంటం నర్సింహారెడ్డి అన్నారు. ఆదివారం మండల పరిధిలోని అమ్డాపూర్ రక్త మైసమ్మ దేవాయానికి శంషాబాద్ మండల పరిధిలోని రాళ్లగూడకు చెందిన మాదిరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి 3 కిలోల వెండి కవచారుని అమ్మవారి రూపాన్ని ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారు ఎంతో మహిమగలవారని, కోరిన కోర్కెలు తీర్చే తల్లీ అని పేర్కొన్నారు. వారిని ఆలయ చైర్మన్ నర్సింహారెడ్డి, గ్రామస్తులు సాయిపాల్‌రెడ్డి, అర్చకుడు అంజన్నశాస్త్రి ఘనంగా సన్మానించారు.

క్రికెట్ టోర్నీ ప్రారంభం



టోర్నీని ప్రారంభిస్తున్న నాయకులు

షాద్‌నగర్: మండల పరిధిలోని దూసకల్ గ్రామంలో ఆదివారం డీపీఎల్ (దూసకల్ ప్రీమియర్ లీగ్)ను ప్రారంభించారు. ఈ టోర్నీని షాద్‌నగర్ మున్సిపాలిటీలోని చటాన్‌పల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నేత నందారం అశోక్‌యాదవ్ ప్రారంభించారు. కార్యక్రమంలో టోర్నీ నిర్వాహకులు ప్రకాశ్‌యాదవ్, మహేందర్, ఖాజా, మాజీ సర్పంచ్ మురళీధర్‌రెడ్డి, నాయకులు శివకుమార్, మహేశ్, శివ, నందు, మాధవరెడ్డి, శ్రీధర్‌గౌడ్, అంజి, హరికుమార్, శ్రీరాం, మల్లేశ్, ప్రేమ్, రమేశ్, నాని, జగన్, రాఘవేందర్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా అయ్యప్ప పడిపూజ


మహేశ్వరం: పడిపూజలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్, నాయకులు


పహాడీషరీఫ్: పడిని వెలిగిస్తున్న స్వాములు

మహేశ్వరం: మండల కేంద్రంలోని శివగంగ రాజరాజేశ్వర ఆలయంలో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కర్రోళ్ల భానుచందర్ ముదిరాజ్, శివలీల దంపతులు అయ్యప్ప మహా పడిపూజ కార్యక్రమం ఆదివారం వైభవంగా నిర్వహించారు. గురుస్వాముల మంత్రోచ్చారణలతో స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి భజనలు, భక్తి గీతాలు ఆలపించారు. పూజ సన్నిధానంలో అయ్యప్పకు అభిషేకం, నవగ్రహాల పూజ, పంచామృతాభిషేకం, కలశ పూజ, పష్పాలంకరణతో పాటు పలు పూజా కార్యక్రమాలను నిర్వహించారు. గురుస్వాములు, భక్తులతో కలిసి కర్రోళ్ల భానుచందర్ ముదిరాజ్, శివలీల దంపతులు అయ్యప్ప మహాపడిని వెలిగించారు. ఈ సందర్భంగా శబరిమలకు వెళ్లనున్న స్వాములకు గురుస్వాములు ఇరుముళ్లు కట్టారు. పూజకు హాజరైన భక్తులకు అన్నదాన కార్యక్రమం చేపట్టారు. అనంతరం సాయంత్రం ఐదు గంటలకు గ్రామంలో అయ్యప్ప మాలను ధరించిన భక్తులు ఇరుముడులతో శబరిమలకు తరలివెళ్లారు. ఇరుముడి మహాపూజకు ఎమ్మెల్యే పి.సబితారెడ్డి, మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్ హాజరై ప్రత్యేక పూజలు చేశారు. అయ్యప్ప భక్తులు పూజకు విచ్చేసిన అతిథులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు, గురుస్వాములు, వివిధ గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

నేత్రపర్వం.. ఇరుముడి మహోత్సవం

పహాడీషరీఫ్: మామిడిపల్లిలోని శ్రీ బాల మణికంఠ అయ్యప్పస్వామి దేవస్థానంలో ఇరుముడి పూజ ఆదివారం నేత్రపర్వంగా కొనసాగింది. 41రోజుల పాటు నియమ నిష్ఠలతో మండల దీక్షను పూర్తి చేసుకున్న అయ్యప్ప స్వాములు ఉదయం 10 గంటల నుంచి ఇరుముడులను కట్టుకున్నారు. అనంతరం పద్దునెట్టాంబడి ఎక్కి స్వామివారిని దర్శించుకున్నారు. 114 మంది స్వాముల ఇరుముడుల కార్యక్రమం కావడంతో ఆయా స్వాముల బంధుమిత్రులతో ఆలయ ప్రాంగణం సందడిగా మారింది. గ్రామస్తుడు ఎడ్ల కృష్ణారెడ్డి కుటుంబం ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు. మాజీ ఎమ్మెల్యే కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి విచ్చేసి స్వామివారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త మద్ది జగదీశ్వర్‌రెడ్డి గురుస్వామి, కార్పొరేటర్ సుక్క శివకుమార్, గురుస్వాములు జగన్‌మోహన్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, నాయకులు నిమ్మల నరేందర్‌గౌడ్, ఎడ్ల వాసుదేవారెడ్డి, గుర్జని సుమన్‌గౌడ్, రఘువీర్‌రెడ్డి, కుమార్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

గుంతలు పడి.. కంకర తేలి

గ్రామీణ రోడ్లు గుంతలు పడి, కంకర తేలి అధ్వానంగా మారాయి. కనీసం నడిచివెళ్లేందుకు కూడా వీలులేని పరిస్థితికి చేరాయి. ఇక ద్విచక్రవాహనదారులు, భారీ వాహనాలపై రాకపోకలు చేసేవారికి నరకం చూపిస్తున్నాయి. ఈ రోడ్లపై వాహనాలు బోల్తాపడి వాహనదారులు గాయాలపాలవుతున్నారు. ఏళ్లుగా మరమ్మతులు చేపట్టకపోవడంతో అధ్వానంగా మారాయని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.


అధ్వానంగా కొందుర్గు-ఉమ్మెంత్యాల రోడ్డు దుస్థితి

- ఏళ్ల తరబడి మరమ్మతులకు నోచుకోని రోడ్లు
- అధ్వాన దారులపై తరచూ ప్రమాదాలు
- పట్టించుకోని సంబంధిత అధికారులు

కొందుర్గు: కొందుర్గు, జిల్లేడ్ చౌదరిగూడ మండలాల్లోని వివిధ గ్రామాలకు వెళ్లే రోడ్లు అధ్వానంగా తయారయ్యాయి. ఏళ్ల తరబడి మరమ్మతులకు నోచుకోకపోవటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ దారుల గుండా వెళ్లాలంటేనే వాహనదారులు భయాందోళనకు గురవుతున్నారు. రాత్రిపూట గుంతల రోడ్లపై ప్రయాణం నరకంగా మారిందని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. కొందుర్గు నుంచి ఉమ్మెంత్యాలకు వెళ్లే బీటీరోడ్డు అడుకో గుంత అన్న చందంగా మారింది. అదేవిధంగా కొందుర్గు మండల కేంద్రం నుంచి వయా తూంపల్లి మీదుగా జిల్లేడ్ చౌదరిగూడ మండల కేంద్రానికి వెళ్లే దారికి మరమ్మతుల కోసం తవ్వి అలాగే వదిలేయడంతో వాహనదారులు అవస్థలు పడుతున్నారు. గుంతలు పడి, కంకర తేలిన రోడ్లపై వాహనాలు బోల్తాపడి ప్రమాదాలు సైతం జరిగాయని ప్రయాణికులు పేర్కొంటున్నారు.

అడుగుకో గుంత..

కొందుర్గు నుంచి ఉమ్మెంత్యాలకు వెళ్లే బీటీరోడ్డుపై అడుగుకో గుంతతో పాటు కంకర తేలడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. అదేవిధంగా కొందుర్గు మండల కేంద్రం నుంచి వయా తూంపల్లి మీదుగా జిల్లేడ్ చౌదరిగూడ మండల కేంద్రానికి వెళ్లే దారికి మరమ్మతులు చేయడంలో భాగంగా రోడ్డు తవ్వి ఏడాది కావొస్తున్నా నేటికీ పనులు చేయడం లేదు. రోడ్డు మధ్యలో తవ్వకుండా వదిలేసిన ఒక మీటరు వెడల్పు గల రోడ్డుపైనే వాహనదారులు వెళ్తున్నారు. అయితే వాహనం ఎదురుగా వస్తే రోడ్డు దిగడానికి రావడం లేదని, రోడ్డు దిగితే కింద పడిపోవాల్సిందేనని వాహనదారులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికే పలువురు కిందపడి ప్రమాదాలకు గురయ్యారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్లకు మరమ్మతులు చేయించాలని కోరుతున్నారు. రోడ్ల మరమ్మతులకు ప్రతిపాదనలు పంపామని అధికారులను అంటున్నారే తప్పా బాగు చేయడం లేదు.


కొందుర్గు-చౌదరిగూడ రోడ్డు పరిస్థితి

మరమ్మతులు చేపట్టాలి



రోడ్డుపై వెళ్లాలంటేనే భయంగా ఉంది. వాహనాలపై కొత్తవారు వస్తే ఎప్పుడు ఏ గుంతలో పడి ఎలాంటి ప్రమాదాలకు గురవుతారోనన్న భయంగా ఉంది. పేరుకు బీటీరోడ్లు తప్పా రోడ్డుపై బీటీ కనిపించని దుస్థితికి చేరాయి. దెబ్బతిన్న రోడ్లకు వెంటనే రీబీటీ చేయించాలి.

–కావలి గోపాల్, ముట్పూర్

ఉన్నతాధికారులకు నివేదిస్తాం



దెబ్బతిన్న రోడ్ల వివరాలు సేకరించి మరమ్మతులకు కోసం ఉన్నతాధికారులకు నివేదిస్తాం. ఉమ్మెంత్యాల, రేగడిచిల్కమర్రి, చిన్నఎల్కిచర్ల రోడ్లు అధ్వానంగా మారాయి. ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి ప్రభుత్వం ద్వారా నిధుల మంజూరుకు కృషిచేస్తాం.

–లక్ష్మిఅనురాధ, ఎంపీడీఓ

మాజీ ఎంపీని కలిసిన నాయకులు


మాజీ ఎంపీ గడ్డం రంజిత్‌రెడ్డితో నాయకులు

చేవెళ్ల: రాబోయే స్థానిక సంస్థల్లో పార్టీని గెలిపించేందుకు అందరూ కలిసికట్టుగా పనిచేయాలని మాజీ ఎంపీ గడ్డం రంజిత్‌రెడ్డి అన్నారు. నగరంలోని ఆయన నివాసంలో కలిసిన నాయకులు శాలువాతో సన్మానించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన వారితో చేవెళ్ల రాజకీయాలపై చర్చించారు. నాయకులందరూ కలిసికట్టుగా పార్టీ బలోపేతానికి కృషిచేయాలని సూచించారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ సత్తాచాటాలని తెలిపారన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ దేవర వెంకట్‌రెడ్డి, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు బి.ఆగిరెడ్డి, మొయినాబాద్ జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కాలె శ్రీకాంత్, దామరగిద్ద మాజీ సర్పంచ్ ఆర్ మధుసూదన్‌గుప్తా, చేవెళ్ల మాజీ ఉప సర్పంచ్ శ్రీనివాస్, యూత్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు ఎం.శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

మున్సిపాలిటీని ఆదర్శంగా తీర్చిదిద్దుతాం

ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి


ఎమ్మెల్యే కసిరెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న కాలనీవాసులు

ఆమనగల్లు: మున్సిపాలిటీని అన్ని రంగాల్లో ఆదర్శంగా తీర్చిదిద్దుతామని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. నగరంలోని ఆయన నివాసంలో ఆదివారం పట్టణంలోని విద్యానగర్ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు పాష, కార్యదర్శి జంగయ్య, సభ్యులు చుక్క అల్లాజీగౌడ్, నర్సింహ, రమేశ్ తదితరులు ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. అనంతరం కాలనీలో ఓల్టేజీ సమస్య పరిష్కారానికి ట్రాన్స్‌ఫార్మర్, కృష్ణ తాగునీటి పైపులైన్, మురుగు కాలువలు, కమ్యూనిటీ హాలు నిర్మాణానికి నిధులు మంజూరు, ఎంపీడీఓ కార్యాలయం, జెడ్పీహెచ్ఎస్ చుట్టూ షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించడంతో పాటు తదితర సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. దీనికి స్పందించిన ఎమ్మెల్యే.. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తుందని, పట్టణాన్ని అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చినట్లు నేతలు తెలిపారు. కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు అయిల శ్రీనివాస్‌గౌడ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కిషన్‌రెడ్డి, నాయకులు సంజీవ్‌యాదవ్, యాదగిరి పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి విరాళం

షాద్‌నగర్‌రూరల్: పట్టణంలోని హాజిపల్లి రోడ్డు విజయనగర్‌కాలనీలో గల వీరాంజనేయ సహస్ర లింగేశ్వరస్వామి దేవాలయ అభివృద్ధికి ఆదివారం పట్టణానికి చెందిన దాతలు ఎలుకుర్తి నారాయణ, ఎలుకుర్తి శ్రీనివాస్ లక్ష రూపాయల విరాళాన్ని ప్రకటించారు. ఈ సందర్భంగా దేవాలయ ప్రాంగణంలో ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులకు విరాళం అందజేశారు. అనంతరం దాతలను ఆలయ కమిటీ సభ్యులు శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు బాలగోపాల్, శంకర్‌రెడ్డి, ఎలికట్ట శేరివెంకట్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, బాలయ్య, వెంకట్‌రెడ్డి, సురేందర్‌గౌడ్, భగవంత్‌గౌడ్, లింగం, ఆర్యవైశ్య సంఘం నాయకులు ఎంసాని శ్రీనివాస్, నర్సింలు, నీలరవి, రవికిరణ్ తదితరులు పాల్గొన్నారు.